దొడ్డు వడ్లకు బోనస్ చెల్లించాలి



రైతుల ధర్నాలో మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులు, నాయకులు

- తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దే
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా

జగిత్యాల టౌన్, మే 16: సన్న రకాలతో పాటు దొడ్డు వడ్లకు కూడా క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి, మిషన్ కాకతీయ, 24 గంటల విద్యుత్, రైతు బంధు, సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడంతో ధాన్యం దిగుబడి పెరిగిందన్నారు. పంజాబ్ తర్వాత తెలంగాణ వరి ధాన్యం దిగుబడిలో రెండో స్థానంలో ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అకాల వర్షానికి ధాన్యం తడిసి అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం క్వింటాలుకు రూ. 1800 చొప్పున ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారన్నారు. కాంగ్రెస్ రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ. 12 వేల చొప్పున ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. తెలంగాణ రైతాంగం కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మాట మార్చి సన్నరకం వడ్లకు మాత్రమే రూ. 500 బోనస్ ఇస్తామనడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి ప్రతి పంటకు బోనస్ ఇస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు మాట మార్చుతున్నారన్నారు. బస్సు యాత్ర ద్వారా ఎండిన పంట పొలాలను కేసీఆర్ పరిశీలిస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ ఎంజాయ్ చేయడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

జగిత్యాల: పట్టణంలో అవగాహన ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

మారుతీనగర్: మెట్‌పల్లి పట్టణంలో..

జాతీయ డెంగీ దినోత్సవం

జగిత్యాల/అర్బన్/ రూరల్/మల్లాపూర్/మేడిపల్లి/మారుతీనగర్/రాయికల్/ఇబ్రహింపట్నం/కథలాపూర్, మే 16: జిల్లా వ్యాప్తంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ ఆరోగ్యమిషన్ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మోతేవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డెంగీపై అవగాహన ర్యాలీ చేపట్టగా డీఎంహెచ్‌వో డాక్టర్ పుష్పాల శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సమీ యెద్దీన్, డాక్టర్ జైపాల్ రెడ్డి, వైద్యాధికారులు సంతోష్, స్వాతి, లక్ష్మణ్, చైతన్య రాణి, జాతీయ ఆరోగ్యమిషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి స్వామి, జిల్లా ఎపిడమాలజిస్ట్ వంశీకృష్ణ, సిబ్బంది శ్రీధర్, భూమేశ్వర్, సృజన్, వేణు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, వైద్యాధికారి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో వైద్యాధికారి వాహిణి, సీహెచ్‌వో రామ్మోహన్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో డాక్టర్ ప్రవీణ్‌చంద్ర, ఎంపీటీసీలు అంకం వినోద, విజయసాగర్, మకిలి దాస్, నాయకులు దేశవేని కృష్ణ, సీహెచ్‌వో దేవన్న, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు డెంగీపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు అంజిత్‌రెడ్డి, వాణిరెడ్డి, విలేయత్ బేగ్, మున్సిపల్ అధికారులు రత్నాకర్, అచ్యుత్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. రాయికల్ మండలం ఒడ్డె లింగాపూర్‌లో వైద్యాధికారి కస్తూరి సతీశ్, సీహెచ్‌వో ప్రమీల, సూపర్‌వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ భూమయ్య, నర్సింగ్ ఆఫీసర్లు మౌనిక, స్వాతి, ఫార్మసిస్టు దీపిక, ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి, లవకుమార్ ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు. కథలాపూర్‌లో వైద్యాధికారి సింధూజ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఇబ్రహింపట్నంలో వైద్యాధికారి హరీశ్‌కుమార్, సీహెచ్‌వో విజయభాస్కర్, హేమలత, కృపాకర్, ఉదయ్‌ప్రసాద్, రాజేందర్, మౌనిక, సుశీల, నరేశ్, లక్ష్మణ్, రఫీ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ తీస్తున్న డాక్టర్ ప్రవీణ్‌చంద్ర, ఆరోగ్య సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Peddolla Raju, S/o. Rajaiah, H.No. 7-20/1, Nizamabad V/o Konaraopet Mandal, Rajanna Sircilla Dist. my surname was changed as **Thallapally Raju S/o Rajaiah.**
NTK-311464

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

మెట్‌పల్లి: పట్టణంలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

ధర్మపురి: పట్టణంలో...

భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

కోరుట్ల: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

- కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా
- వడ్లకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్

మెట్‌పల్లి, మే 16: వరి ధాన్యానికి బోనస్, పెట్టుబడి సాయం పెంపు, ఇతర హామీలు అమలు చేయాలని అన్నదాతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద 63వ జాతీయ రహదారిపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పలువురు రైతులు విమర్శించారు. సన్న రకాలతో పాటు దొడ్డు వడ్లకు కూడా క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్, రైతు బంధు పథకం కింద ఎకరానికి రూ. 15 వేలు పెట్టుబడి సాయం పంపిణీ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి సముదాయించడంతో ఆందోళన విరమించారు. అక్కడి నుంచి అదనపు కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, మల్లాపూర్ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బోయిన పల్లి చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ సాయిరెడ్డి, నాయకులు ఆకుల ప్రవీణ్, రాయల్, ముదాం నర్సింలు, లింగంపల్లి సంజీవ్, ఎలాల దశరథరెడ్డి, కందరి ప్రతాప్‌రెడ్డి, బద్ధం అంజిరెడ్డి, పీసు తిరుపతిరెడ్డి, ఒజ్జెల బుచ్చిరెడ్డి, మురళీధర్‌రెడ్డి,రాజాగౌడ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల పట్టణంలో...

కోరుట్ల, మే 16: కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదేశాలతో గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా రహదారిపై బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సన్నరకాలతో పాటు దొడ్డు వడ్లకు కూడా క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చి సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించడం తెలంగాణ రైతాంగాన్ని వంచించడమేనన్నారు. సన్న రకాలతో పాటు దొడ్డు వడ్లకు కూడా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అనిల్, ఆయా మండలాల తాజా మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి, మే 16: కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్మపురిలో ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ సన్న వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ రైతుబంధు, పంట రుణ మాఫీ, ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో డీటీ సుమన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మొగిలి శేఖర్, కౌన్సిలర్లు వేణు, అశోక్, యూనుస్, నాయకులు సంగి శేఖర్, ఒడ్నాల మల్లేశం, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, అనంతుల లక్ష్మణ్, బాలరాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పెగడపల్లి, మే 16: ఉపాధి హామీ పని స్థలాల్లో కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ఎగ్గెలకుంటలో చేపడుతున్న పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించడంతో పాటు పని స్థలాల్లో తాగు నీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఈజీఎస్ ఎఫ్ఏ రవికుమార్, కారోబార్ స్వామి, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీ రాష్ట్ర చైర్మన్‌తో సమీక్ష

వేతన సవరణ కమిటీ రాష్ట్ర చైర్మన్ శివశంకర్‌కు వినతి పత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జగిత్యాల టౌన్, మే 16: హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో వేతన సవరణ కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎన్ శివశంకర్‌తో రాష్ట్ర పీఆర్‌టీయూ నాయకులతో కలిసి సమావేశమైనట్లు జగిత్యాల నాయకులు తెలిపారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు అన్ని యాజమాన్యాల్లోని వివిధ విద్యా సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, పెన్షనర్స్‌కు సంబంధించిన వేతన సవరణ, తదితర అంశాలపై చర్చించి పీఆర్సీ నివేదికలో పొందుపర్చాలని రాష్ట్ర, జిల్లా నాయకులు కోరినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంతరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్ల పాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

కొడిమ్యాల, మే 16: మండల కేంద్రంలోని రామాలయానికి సంబంధించిన 12 ఎకరాల 28 గుంటల భూమి మల్యాల మండల కేంద్రంలో ఉండగా గురువారం కౌలు కోసం వేలం పాట నిర్వహించినట్లు ఈవో వెంకన్న తెలిపారు. రెండేళ్ల కౌలుకు రూ. లక్షా 50 వేలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, ఈవో వెంకన్న, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా మందుల విక్రయం

నిందితుడికి ఏడాది జైలు, రూ. 50 వేల జరిమానా

కోరుట్ల, మే 16: లైసెన్స్ లేకుండా మందులు నిల్వ చేసి విక్రయించిన నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధిస్తూ గురువారం కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన రామ్మోహన్ అనుమతి లేకుండా మందులు నిల్వ చేసి అమ్ముతున్నాడనే సమాచారంతో 2015, ఏప్రిల్‌లో ఔషధ నియంత్రణ అధికారులు పట్టణంలోని శ్రీరామ క్లినిక్‌పై దాడులు చేశారు. ఈ దాడుల్లో పలు రకాల అల్లోపతిక్ మందులను సీజ్ చేసిన అధికారులు కేసు నమోదు చేసి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున మాధవి కేసులో వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ఈదురు గాలుల బీభత్సం

జగిత్యాల రూరల్: రహదారిపై పడిన చెట్టు

జగిత్యాల రూరల్, మే 16: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్–మోరపల్లి గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం ఈదురు గాలులకు భారీ వృక్షం విరిగి పడింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

సారంగాపూర్, మే 16: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు కవర్లు కప్పారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

విద్యార్థిని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కోరుట్ల, మే 16: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో గురువారం ఆయన పదో తరగతి పూర్తయిన విద్యార్థులను కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, వంశీకృష్ణ, శిరీష్, సాయి కృష్ణ, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల/జగిత్యాల రూరల్, మే 16: జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ హౌసింగ్ బోర్డు కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో గల వాణీనగర్, తులసీనగర్, బీట్ బజార్, గీతావిద్యాలయం, నటరాజ్ చౌరస్తా, బసవ కూడలి, ఇస్లాంపూర్, నిజామాబాద్ రోడ్, పురాణిపేట ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8.00 నుంచి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎండీ రహీం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, సోమన్‌పల్లి, సంగంపల్లి, హబ్సీపూర్, హన్మాజీపేట, కండ్లపల్లి గ్రామాలకు ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

కోరుట్ల, మే 16: పట్టణంలోని భీమునిదుబ్బ, హాజీపుర, బస్టాండ్ ఏరియా, అంబేద్కర్‌నగర్, రథాల పంపు, ఎల్ఐసీ కాలనీ, ఇందిరా రోడ్డు, మున్సిపల్ ఏరియా, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డు, బస్ డిపో పరిసరాలు, డైమండ్ ఏరియా, మొయిన్‌పుర ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏఈ శ్యాం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఆదర్శనగర్, ఎరుకలవాడ, బంజారనగర్, ముక్క ఫంక్షన్ హాల్, దేశాయినగర్ కాలనీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ సత్యనారాయణ పేర్కొన్నారు.

వెల్గటూర్, మే 16: పైడిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పైడిపల్లి, సంకెనపల్లి, కిషన్‌రావుపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్, మే 16: మెట్‌పల్లి సబ్‌డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్లలో శుక్రవారం నుంచి మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీఈ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న జగ్గసాగర్, వెల్లుల్ల సబ్‌స్టేషన్లు, 18న కోనరావుపేట, వేంపేట, చౌలమద్ది, మెట్‌పల్లి టౌన్, 19న ఆత్మకూర్, 20న మేడిపల్లి పడమర, వెంకట్రావుపేట, బండలింగాపూర్, మెట్లచిట్టాపూర్, అమ్మక్కపేట, డబ్బా వాటర్ గ్రిడ్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

బడిబాట

కోరుట్ల రూరల్, మే 16: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో ఎంఈవో గంగుల నరేశం, మాజీ సర్పంచ్ గుగ్గిల్ల తుక్కారాం ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుగ్గిల్ల సురేశ్‌గౌడ్, రాజం, ప్రధానోపాధ్యాయుడు పవన్, ఉపాధ్యాయులు జనార్దన్, కిషన్, రాజగోపాల్, యాదగిరి, మమత, నారాయణ, మహేశ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవో, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఆర్థిక సాయం

జగిత్యాల, మే 16: జిల్లా కేంద్రంలోని బుడిగ జంగాల కాలనీకి చెందిన నూనె తిరుపతికి రెండు కిడ్నీలు చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా, శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రూ.19,100 నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్, మే 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన సేవ వారధి మండలి సభ్యులు గురువారం రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సేవ వారధి సభ్యులు పాల్గొన్నారు.

దోస్త్ సహాయక కేంద్రం ఏర్పాటు

జగిత్యాల, మే 16: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దోస్త్ సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్, దోస్త్ అడ్మిషన్ల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరిగెల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ప్రిన్సిపాల్ సెల్ 98484 15835, ఎన్ సందీప్ (అకాడమిక్ కో–ఆర్డినేటర్) సెల్ 98855 88419, గణేశ్ (టెక్నికల్ అసిస్టెంట్) సెల్ 99632 87177లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హామీల అమల్లో సర్కారు విఫలం

చిగురుమామిడి, మే 16: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందని హుస్నాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మండిపడ్డారు. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ పోలింగ్ ముగిసిన తెల్లారే బోనస్‌పై మాట మార్చడం సరికాదన్నారు. బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన

వెల్గటూర్, మే 16: వెల్గటూర్, అంబారిపేట పీహెచ్‌సీలో అసంక్రమిత అసంక్రమిత వ్యాధులపై సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ తీశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్, డాక్టర్ లవ కుమార్, ట్రైనింగ్ అధికారులు మురళి, సుమన్, సీహెచ్‌వో జగన్నాథం, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హమాలీ మృతి

వెల్గటూర్, మే 16: ధాన్యం తూకం వేస్తుండగా హమాలీ గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ముత్తునూర్‌లో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి చెందిన మొకెనపల్లి రాజయ్య (50) గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో హమాలీ పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ధాన్యం బస్తాలు ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా ఒక్కసారి కింద పడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఆలోపు ఆటోలో దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో 108 సిబ్బంది వచ్చి పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, రాజయ్య తన వరి ధాన్యం కేంద్రంలో పోసి 15 రోజులు దాటినా ఇప్పటికీ తూకం వేయలేదని కుటుంబసభ్యులు తెలిపారు.

ఓపెన్ యాక్షన్ ద్వారా మామిడి కాయల కొనుగోలు